

31న నాక్ ప్రాంగణంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు బొమ్మూరు నాక్ ప్రాంగణంలో ఈ నెల 31న జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు వరుణ్ మోటార్స్ ప్రయివేటు లిమిటెడ్, ఇండియన్ డైరీ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, జల ఎన్విరో, ఇన్నోవా సోర్స్, ఫినో పేమెంట్ బ్యాంకు, కన్స్ కార్ప్, ఆపాక్ ఫైనాన్స్, ముతూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ హాజరుకానున్నాయని ఆయన తెలిపారు. వీటిలో గల వివిధ ఉద్యోగాలలో పనిచేయడానికి ఎమ్‌కాం, ఎంబిఎ, డిగ్రీ, ఫార్మసీ, ఇంటర్, ఐటిఐ, 10వ తరగతి పూర్తి చేసిన 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గల వారు అర్హులని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు "9133912947", "9676052454" నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

30 నుంచి సిపిఎం బస్సు జాతాలు

- రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఏజెన్సీ ప్రాంతాల నుంచి ప్రారంభం
- మతోన్మాద బిజెపిని, దాని మద్దతుదారులను ఓడించడమే లక్ష్యం
- మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ వెల్లడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపిని, దాని మద్దతుదారులను ఓడించండి. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిర్బంధ విధానాలపై పోరాడండి" అనే నినాదంతో ప్రజలను చైతన్యపరిచేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి బస్సు జాతాలు ప్రారంభం కానున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ వెల్లడించారు. స్థానిక 'పెన్షనర్స్ హాల్'లో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలను కవర్ చేస్తూ మన్యం జిల్లాలోని పార్వతీపురం నుంచి ఒక జాత, శ్రీకాకుళం జిల్లా మందస నుంచి రెండో జాత, రాయలసీమలోని కర్నూలు నుంచి మూడో జాత ప్రారంభం అవుతాయన్నారు. నవంబర్ 6న బస్సు జాత రాజమహేంద్రవరం నగరానికి చేరుకుంటుందని వివరించారు. ప్రజా రక్షణ భేరి పేరుతో సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలో నవంబర్ 15న భారీ బహిరంగ సభ జరుగుతుందని, దీనికి సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, పోలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు తదితర నాయకులు హాజరవుతున్నారన్నారు. కేంద్రంలో మోడి, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఈ బస్సు యాత్ర ద్వారా ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తేవడమే లక్ష్యంగా ఈ జాతాలు సాగుతాయని తెలిపారు. మోడి ఇచ్చిన ఏ హామీని నేరవేర్చలేదని, అంబానీ, ఆదానీలకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడుతూ పాలన మొత్తం కార్పొరేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ కూడా మోడి ఏది అమలు చేయమంటే అదే అమలు చేస్తూ ప్రజల్ని కష్టాల పాలు చేస్తున్నారన్నారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం 30 అంశాలతో ప్రజా ప్రణాళికను విడుదల చేశామన్నారు. ప్రజా ప్రణాళికలో ముఖ్యంగా విద్యుత్ యూనిట్ రూపాయికే ఇవ్వడంతోపాటు, పేదలకు 300 యూనిట్లు ఉచితంగా సరఫరా చేయడంతోపాటు, స్మార్ట్‌మీటర్ల బిగింపు, ట్రూఅప్ ఛార్జీల రద్దు చేస్తామన్నారు. రూ.400కే గ్యాస్, రూ.60కే లీటర్ పెట్రోలు, డీజిల్, ఇసుక ఉచితం, ఒక్కొక్కరికి పదికేజీల ఉచిత బియ్యం, పప్పు నూనె సరఫరా, నిత్యావసర ధరల తగ్గింపు, అందరికీ సంక్షేమం, పెన్షన్లు, రేషన్‌కార్డులు అన్నిరకాల పెన్షన్లు రూ.5 వేలు, పేద మహిళలకు ప్రత్యేక సాయం, రెండు సెంట్ల ఇల్లు, రూ.5 లక్షల ఆర్థికసాయం, నివాసిత ప్రాంతాల్లోనే ఇళ్లకు పట్టాలు, కొత్తకాలనీలకు అన్ని సౌకర్యాలు, చెత్తపన్ను, డ్రైనేజీ ఛార్జీల రద్దు, ఇంటిపన్ను తగ్గింపు, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, అమరావతిలోనే రాజధాని, 40 వేల టీచర్‌పోస్టులకు మెగా డిఎస్‌సి, 2.50 లక్షల ప్రభుత్వ ఖాళీల భర్తీ, నిరుద్యోగభృతి నెలకు రూ.5 వేలు, ఓపిఎస్ పునరుద్ధరణ, ప్రయివేటు ఉపాధ్యాయులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పెన్షన్, భూమిలేని వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు రెండెకరాల భూమి, సేకరించిన భూముల్లో పరిశ్రమలు లేదంటే రైతులకు వాపస్, అసలు పట్టాదారులకే అసైన్డ్ భూములపై హక్కులు, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు, గ్రామీణ ఉపాధి 200 రోజులు, రోజు వేతనం రూ.600. పట్టణ ఉపాధి గ్యారంటీ చట్టం, సమానపనికి సమాన వేతనం వంటివి తమ అమలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు బి.పవన్, జె.రాంబాబు, ఎస్ఎస్.మూర్తి, బి.రాజులోవ పాల్గొన్నారు.



ప్రజా ప్రణాళిక మేనిఫెస్టోను విడుదల చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్, ఇతర నాయకులు



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, టిడిపి ఎంఎల్ఏ గోరంట్ల, ఇతర అధికారులు

జెకెసి ఫిర్యాదులపై తక్షణ చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. రూరల్ మండలానికి సంబంధించి శుక్రవారం జెకెసి సమావేశాన్ని కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 138 మంది అర్జీలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారం చూపాలన్నారు. ఆమేరకు ప్రతి ఒక్క అర్హత కలిగిన అర్జీలను వారం రోజులలోగా పరిష్కారం చూపాలన్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జెకెసిలో స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు, వాటి తదుపరి పరిష్కార చర్యల ప్రగతిని పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం నేపథ్యంలో నిర్వహిస్తున్న జెకెసి ద్వారా రూరల్ నియోజక వర్గంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. జల జీవన్ మిషన్ కింద చేపడుతున్న పనులకు చెందిన నిధులను ఖర్చు చేయకపోవడంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించాలని కోరారు. గ్రామీణ నియోజక వర్గ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉద్దేశించిన పనులను వేగవంతం చేయాలని కోరారు. ఏపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పనులు సమాంతరంగా చేపట్టడం జరుగుతోందని అన్నారు. 1902, జెకెసి కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెసి ఎన్.తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, డిఆర్‌ఒ జి.నరసింహం, వివిధ శాఖల జిల్లా అధికారులు పి.జగదాంబ, కెవి.కృష్ణారావు, జి. శ్రీనివాసరావు, ఎస్‌జిటి సత్య గోవింద్, ఏ.ముఖ లింగం, ఎన్‌వి సత్యనారాయణ, కె.విజయ కుమారి, జి. పరశురామ్, ఇతర జిల్లా, మండల, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త, నాయకుడు సైనికుల్లా పనిచేయాలని రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పిలుపునిచ్చారు. శుక్రవారం బూరుగుపూడి నాగసాయిరాం కళ్యాణ మండపంలో రాజానగరం నియోజకవర్గ టిడిపి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ శ్రేణులంతా ఉత్సాహంగా పనిచేయాలని, భవిష్యత్తు గ్యారెంటీ సమన్వయ కమిటీ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, గ్రామ కమిటీ అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాబోయే ఎన్నికలు టిడిపికి కీలకం కాబోతున్నాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలనకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, పార్టీ శ్రేణులంతా ఎన్నికల జాబితాలో దొంగ ఓట్లు గుర్తించి సంబంధిత అధికారులకు తెలపాలని అన్నారు. పార్టీ శ్రేణుల్లో ఎవరికైనా ఓటర్ల జాబితాలో సమస్యలు ఉంటే పరిష్కరించాలని తెలిపారు.

వైసిపి నేతల వెన్నులో వణుకు : ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరిట చేపట్టిన యాత్రతో వైసిపి నేతల వెన్నులో వణుకు ప్రారంభమైందని మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంచి ఎప్పటికైనా నిలుస్తుందని.. నిజం తప్పక గెలుస్తుందన్నారు. 'నిజం గెలవాలి' అని భువనేశ్వరి ప్రజల మధ్యకు వెళ్లే క్రమంలో వారి నుంచి వస్తున్న ఆదరణ కష్టకాలంలో ఉన్న ఆమెకు ఊరటనిస్తుందని తెలిపారు. నేటి రాక్షస పాలనలో వారు పడుతున్న కష్టాలను భువనేశ్వరి దృష్టికి తీసుకొస్తున్న తీరు చూస్తుంటే వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టం అవుతుందన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన వైసిపి మంత్రులు, నాయకులు ఎన్ని యాత్రలు చేసినా ఫలితం లేదన్నారు. బస్సు యాత్రకు జనసమీకరణ చేయకపోతే సిఎఫ్‌లు, ఎపిఎంలు రూ.200 జరిమానా విధిస్తామని బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు.

ఓటర్లను అయోమయంలోకి నెడుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - గోకవరం

ఓటరు జాబితాలో తన పేరు ఉందో లేదో అని నిరంతరం అయోమయ స్థితిలోకి ఓటర్లను రాష్ట్ర ప్రభుత్వం నెట్టివేసిందని టిడిపి రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యాక్షులు అడపా భరత్ బాబు విమర్శించారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్లు ఉన్నాయో, తప్పించారో అని తెలుసుకోవాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో అధికారాన్ని ఉపయోగించి వ్యతిరేకులుగా గుర్తించిన వారి ఓట్లను తొలగించే ప్రక్రియలో భాగంగానే ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను ఎన్నికల సంఘం సస్పెండ్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఓటమికి భయపడిన ప్రభుత్వం ఇటువంటి అక్రమాలకు పాల్పడుతూ ఉద్యోగులను బలి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - కడియం

'దేశం కోసం ఖాదీ - ఫ్యాషన్ కోసం ఖాదీ" అనే నినాదంతో మండల స్థాయి పోటీలను శుక్రవారం కడియం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండల విద్యాధికారి-2 వై.నాగేశ్వరరావు విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు అందజేసి పోటీలు ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొనగా, వ్యాసరచనలో కడియం, వీరవరం, చైతన్య నగర్ పాఠశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లోనూ, వక్తృత్వ పోటీలో కడియం, చైతన్య నగర్, కడియపులంక పాఠశాలలు ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాల్లోనూ క్విజ్ పోటీలో కడియం, వీరవరం, కడియపులంక ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించినట్లు నిర్వాహకులు జి.సత్య నారాయణ తెలిపారు. 28న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో ఈ విజేతలు పాల్గొంటారని ఎంఇఒ వి.లజపతిరాయ్ తెలిపారు.

వైసిపి కమిటీల నియామకం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగర వైసిపి అనుబంధ కమిటీల నియామకాలు పూర్తియినట్లు నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. ఎంపి మార్గాని భరత్, అర్బన్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎస్‌సి సెల్ అధ్యక్షుడుగా కాటం రజనీకాంత్, మైనారిటీ సెల్ అధ్యక్షుడుగా మొహమ్మద్ అరిపుల్లా ఖాన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడుగా గుడాల జాన్సన్, ప్రచార కమిటీ అధ్యక్షులుగా పెదిరెడ్ల శ్రీనివాస్‌లను నియమించినట్లు అడపా శ్రీహరి తెలిపారు.

ఆరోగ్య సంరక్షణ కోసమే జెఎఎస్ శిబిరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని పలువురు వెల్లడించారు. జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం జెఎఎస్ శిబిరాలు జరిగాయి. **గోకవరం** మండలంలోని తిరుమలాయపాలెంలో జెఎఎస్ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భ:గా వైద్య సేవలను, పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, కర్రీ సూరారెడ్డి, చింతల అనిల్ కుమార్, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, సెక్రటరీ గోవింద్, తదితరులు పాల్గొన్నారు. **కడియం** స్థానిక సచివాలయం-2 వద్ద జరిగిన జెఎఎస్ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన రోగులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గిరజాల బాబు, తాడాల చక్రవర్తి, బొట్టు చిన్ని, ఆర్ఎస్ఎన్ మూర్తి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలోని తాడిపర్రులో జెఎఎస్ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, కఠారి సిద్ధార్థ రాజు, ఎంపిటిసి సభ్యులు కట్టా వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శి, విఆర్ఒ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి సూపర్వైజర్లు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **చాగల్లు** మండలంలోని ఎస్.ముప్పవరంలో జెఎఎస్ శిబిరాన్ని ఎంపిడిఒ బి.రాంప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మి, ఎంపిటిసితోపాటు, పంచాయతీ కార్యదర్శి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కార్యకర్తలు, ఆశాలు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **సీతానగరం** మండలంలోని పురుషోత్తపట్నంలో జెఎఎస్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుర్రాల జ్యోస్నా, జడ్‌పిటిసి చల్లమళ్ళ వెంకటలక్ష్మి సుజీరాజు పాల్గొన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఎన్.రాజు, డాక్టర్ ఇ.యేసురాణి, డాక్టర్ రఘు వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరిపల్లి అనురాధ, ఎంపిటిసి ఉస్సే ఏసమ్మ, పంచాయతీ కార్యదర్శి డి మున్నీదీప్తి, తదితరులు పాల్గొన్నారు.



కడియంలో జెఎఎస్ బ్రోచర్‌ను అందిస్తున్న రూరల్ వైసిపి కో-ఆర్డినేటర్ చందన

ఇసుక అక్రమ రవాణా

-గుల్లవుతున్న ఎర్ర కాలువ -పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని ఎర్ర కాలువ నుంచి అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగిపోతుంది. కళ్లెదుటే భారీఎత్తున అక్రమంగా ఇసుకను తరలించుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలోని పోతవరం, పోతునీడుపాలెం, కవులూరు, నబిపేట, అనంతపల్లి, గ్రామాల వెంబడి ఉన్న ఎర్ర కాలువ నుంచి అక్రమార్కులు ఇసుకను రాత్రి, పగలు అన్న తేడా లేకుండా తరలించుకుపోతున్నారు. ప్రతీ రోజు సుమారు 80 నుంచి 100 ట్రాక్టర్ల వరకు ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. గ్రామాల్లో ఇల్లు కట్టుకునే వారికి ఇసుమంత ఇసుక కరువైపోగా పక్క మండలాల్లోని గ్రామాలకు స్థానికంగా ఉన్నటువంటి ఎర్రకాలు నుంచి ఇసుక తరలిపోవడం స్థానిక నిర్మాణదారులకు ఒకింత ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇసుక తరలించేందుకు ప్రభుత్వం నుంచి ఏ విధమైన అనుమతులు లేనప్పటికీ అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమార్కులు ఇసుకను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ ఇసుక రవాణాను ఎవ్వరైనా నిలదీస్తే వారికి కొంతమొత్తంలో చేతులు తడిపి వారు మాత్రం వేలకు వేలు కూడబెట్టుకుంటున్నారు. ఒక ట్రక్కు ఇసుక రూ.4 వేల నుంచి డిమాండ్‌ను బట్టి రూ.6 వేల వరకూ అమ్మకాలు చేస్తున్నారు. ఈవిధంగా ఒక్కో ట్రాక్టర్ నుంచి రోజుకు సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకూ దోచుకుంటున్నారు. గతంలో పోలీసు, రెవెన్యూ అధికారులు ఇసుక ట్రాక్టర్ కనిపిస్తే కేసు రాసేవారు. ప్రస్తుతం రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టపగలే ఎర్ర కాలువలో ఇసుకను తవ్వుతున్న కార్మికులు

ఓటరు జాబితా పరిశీలనకు ప్రదర్శన

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మార్పులు, చేర్పులు అనంతరం పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను ఆయా మండలాల ఎన్నికల అధికారులకు జిల్లా ఎన్నికల అధికారులు అప్పగించారు. ఆ జాబితాలను ఈ నెల 29వ తేదీ నుంచి పోలింగ్ బూత్‌ల వారీగా పంచాయితీలు, ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించేలా ఏర్పాట్లు చేయాలని బిఎల్‌ఒలకు ఆదేశాలు వెలువడ్డాయి. **తాళ్లపూడి** తమ ఓటు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకునేందుకు వీలుగా ఈ నెల 29వ తేదీ నుంచి డిసెంబర్ 9 వరకూ ఓటర్లకు అందుబాటులో ఉంటుందని తహశీల్దార్ టి.రాధిక తెలిపారు. అలాగే నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో కొత్త వాటర్ నమోదుకు అవకాశం ఉందని చెప్పారు. **సీతానగరం** మండలంలో ఉన్న బిఎల్‌ఒలకు తహశీల్దార్ కృష్ణారావు ఆధ్వర్యంలో ఒటర్ల జాబితాలను అందజేశారు. మండలంలోని 61 మంది పోలింగ్ బూత్ బిఎల్‌ఒలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడానికి జనవరి 5 వరకూ అవకాశముందన్నారు. **పెరవలి** ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని తహశీల్దార్ టి.రాజేశ్వరి తెలిపారు. మండలంలోని 56 పోలింగ్ స్టేషన్స్‌కు చెందిన ఓటరు జాబితాను ఆయ బూత్‌లతోపాటు, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచుతున్నట్లు తెలిపారు. ఆయా ఓటర్ల జాబితాను పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీ లోపు నిర్ణీత ఫారంలో అసిస్టెంట్ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. **ఉండ్రాజవరం** మండలంలోని గ్రామ సచివాలయాల్లో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ముసాయిదా ప్రచురణ చేసినట్లు తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు. ఈ ముసాయిదా ప్రకారం గ్రామంలోని ఓటర్లు వారికి సంబంధించిన లిస్టులో తమ తమ పేరు ఉన్నదీ, లేనిదీ సరిచూసుకుని, తప్పొప్పులు, మార్పులు చేర్పులు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోపు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి - దేవరపల్లి

రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, జడ్‌పి మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని మండలంలోని దుద్దుకూరులో నిర్వహించారు. ముందుగా టిడిపి, జనసేన నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాలకు పూలమాలవేసి కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులను, పోలీసులను అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న జగన్మోహన్ రెడ్డి తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని సైకో ప్రజలకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. త్వరలోనే రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగానికి ముగింపు పలికి ప్రజలకు సుభిక్ష పాలన అందించడానికి త్వరలో టిడిపి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనుడు జగన్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో ముళ్ళపూడి బాపిరాజు

కార్టూ'నిజం'



నువ్వు చూసే ఆ సీరియల్.. ఈ కేసూ ఇప్పట్లో అవ్వేవి కావుగానీ వచ్చి కొంచెం వడ్డిస్తావా..!!

పిఎఫ్ సొమ్ము ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పిఎఫ్ సొమ్మును ఇప్పించాలని ఎపిటిఎఫ్ ప్రతినిధి బృందం కమిషనర్ దినేష్‌కుమార్‌ను కోరింది. మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం ఆయనకు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయబ్రహ్మం మాట్లాడుతూ ఇప్పటి వరకూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పనిచేసిన ఉపాధ్యాయులు విద్యాశాఖ పరిధిలోనికి వెళ్లారని తెలిపారు. నగరపాలక సంస్థ అధ్వర్యంలో వినియోగంలో ఉన్న ఉపాధ్యాయుల పిఎఫ్ ఖాతాలను రద్దు చేసి ఆ సొమ్ముని ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణ, రాష్ట్ర మాజీ కార్యదర్శి వర్ఘుల అప్పయ్య శాస్త్రి, మండల శాఖ అధ్యక్షులు డేవిడ్ లివింగ్ స్టన్, జిఎస్ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



పంట నమోదు సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఆర్.బి.కె కేంద్రాల వద్ద రైతులు చేయించుకున్న పంట నమోదులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఆయా కేంద్రాలలో గ్రీవెన్స్ రూపంలో సరి చేయించుకునే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ఎడిఎ చంద్రశేఖర్ రైతులకు సూచించారు. మండలంలోని వేగేశ్వరపురం ఆర్‌బికె వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పంట నమోదు సామాజిక తనిఖీ నిర్వహించారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చాగల్లులో గడపగడపకూ..

ప్రజాశక్తి - చాగల్లు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చాగల్లులోని 5వ సచివాలయం పరిధిలో మీనా నగరంలో శుక్రవారం హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు పోసిన శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఉప సర్పంచ్ మేకరాజు, పార్టీ నాయకులు జుజ్జువరపు రామచంద్రరావు, కోఆప్షన్ సభ్యులు షేక్ పాషా ఎంపిడిఒ బి.రాంప్రసాద్, తహశీల్దార్ కె.రాజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కానూరులో 'బాబుతో నేను'

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు అగ్రహారంలో శుక్రవారం బాబుతో నేను, బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిడదవోలు నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. గ్రామంలో ప్రజలకు చంద్రబాబు అరెస్టును వివరిస్తూ ఇంటి ఇంటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, జనసేన అధ్యక్షులు దాసం మాణిక్యం, అనపర్తి వెంకటనారాయణ(జయ), హనుమంతు, నాగ దొర, పెన్నాడ పుత్రయ్య, హరిదాసు, కాశీ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల భారీగా అన్నదానాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, గోకవరం

మండలంలోని కె.సావరంలో శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల ఉత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ అన్న సమారాధనలో సుమారు 6 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సావరం, పాలంగి, చివటం, వేమవరం గ్రామల నుంచి భక్తులు పాల్గొన్నారు. గోకవరం మండల కేంద్రమైన గోకవరంలోని వీరభద్రుని గద్దే వద్ద కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా ముగింపు సందర్భంగా శుక్రవారం అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదానం కార్యక్రమానికి వ్యాపారవేత్త కంబాల శ్రీనివాసరావు రూ.1.10 లక్షలు విరాళంగా అందించారు. ఆలయ కమిటీ సభ్యులు కంబాల శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బత్తుల నానాజీ, వాకచర్ల రవి పాల్గొన్నారు.



గోకవరంలో అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి - మండపేట

లారీ ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన మండపేట సత్యశ్రీ రోడ్డులో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...స్థానిక సంఘం కాలనీలో నివాసం ఉంటున్న కోనే శ్రీను మంగ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు మహేష్ (13) స్థానిక సత్య శ్రీ రోడ్డులోని ఎస్ఎస్‌వివి మున్సిపల్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఇంటి నుంచి స్కూలుకు వెళ్తుండగా సత్య శ్రీ రోడ్డులోని కోళ్ల ఫారం ఎదురుగా దువ్వలపూడి నుంచి మండపేట వస్తున్న లారీ వెనకనుంచి ఢీకొట్టింది. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై పట్టణ ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో టెక్నీషియన్ మరణం

ప్రజాశక్తి - రాజోలు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో టెక్నీషియన్ పనిచేస్తున్న ఈద్లా ఎజ్రా శాస్త్రి (30) గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం...మలికిపురం మండలం రామరాజులంక చిన పేటకు చెందిన ఎజ్రా శాస్త్రి రాజోలు ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక కోళ్ల వారి వీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. రామరాజు లంకలోని తన సొంత ఇంటికి వెళ్లి గురువారం రాత్రి సమయంలో రాజోలు తిరిగి వస్తుండగా రాజోలు లూథరన్ చర్చి సమీపంలో మోటార్ సైకిల్ అదుపు తప్పి రోడ్డు మీద పాతి పెట్టిన బండరాయిని ఢీ కొట్టి పక్కన ఉన్న మురుగు కాల్వలో పడి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు మృతుని బావ మేడిద నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పలువురు నివాళి

ఏరియా ఆసుపత్రి వద్ద మార్చురీలో ఉన్న ఎజ్రా శాస్త్రి మృతదేహాన్ని ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావు సందర్శించి నివాళులు అర్పించారు. పోస్టు మార్టం అయ్యేంతవరకు ఆసుపత్రి వద్ద ఉండి మృత దేహాన్ని అంబులెన్స్‌లో ఆయన స్వగ్రామానికి తరలించారు. చిన్న వయస్సులోనే ఎజ్రా శాస్త్రి మృతి చెందడం బాధాకరమని అన్నారు. రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పారి సూర్య నారాయణ, వైద్యులు సునీల, వేణు, అజీమ్, ప్రియాంక, ప్రశాంతి, ఐసిటిసి కౌన్సెలర్ ప్రతాప్ ఆసుపత్రి సిబ్బంది శాస్త్రి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

యువతి అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన యువతి అదే గ్రామంలో ఇంటర్మీడియట్ చదువుతుంది. ఈనెల 26న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు, బంధువులు ఇంటి వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్రేయపురం ఎస్ఐ బి.వి.కిరణ్ కుమార్ తెలిపారు.

దాడి చేసిన సంఘటనపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఇరుకు రోడ్డులో ఆటోను ఎందుకు స్పీడుగా డ్రైవ్ చేస్తున్నావ్ అని అడిగిన వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన జవ్వాది వరుణ్ అక్షయ్ గురువారం మెర్లవీధిలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన రాహురి రామకృష్ణ ఆటోను వేగంగా డ్రైవ్ చేస్తూ అక్షయ్‌ని ఢీకొట్టాడు. దీంతో ఇరుకు రోడ్డులో అంత స్పీడు ఎందుకని ప్రశ్నించిన అక్షయ్‌పై రామకృష్ణతోపాటు, అతని కుటుంబసభ్యులు దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు అక్షయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.వి.కిరణ్‌కుమార్ తెలిపారు.

టిడిపి నేతలపై వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సిఎం జగన్మోహన్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం, సిఎం చిత్రపటంపై మద్యాన్ని పోసిన టిడిపి నాయకులపై వైసిపి నాయకులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అర్బన్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నగరంలోని 1, 2, 3 పోలీసు స్టేషన్లలో లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశారు.

జగన్ ఎందుకు కావాలంటే...

ప్రజాశక్తి - పెరవలి

రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. స్థానిక దీపికా ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ సదస్సులో ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగనన్నదని అన్నారు. ఇచ్చిన హామీలను తప్పని జగన్ను మరోసారి సిఎంను చేసుకోవాలని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు ప్రసాద్, జెడ్‌పిటిసి కె.రామాంజని, వి.సత్యనారాయణ, పి.భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

ప్రజాశక్తి - కొత్తపేట

దేవీ నవరాత్రులను పురస్కరించుకుని చిన్నారులచే డి.వెంకట్రాయ నాట్య బృందం శిష్యులు కూచిపూడి ప్రదర్శన అదరిని ఆకట్టుకుంది. మండల పరిధిలోని బిళ్లకుర్రు శివారు దేగల వారి పాలెం గ్రామంలో దేవి నవరాత్రులను పురస్కరించుకుని కాకరపూల కోలా రాము ఆధ్వర్యంలో దేగల వారి పాలెం, వాకాల వారి పాలెం, కొత్తపేట గ్రామాలకు చెందిన 50 మంది చిన్నారులచే క్లాసికల్ కూచిపూడి నాట్య ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం గురువు రామయ్య గ్రామ పెద్దలు సత్కరించారు. చిన్నారులకు మెమొంటోలను కమిటీ వారు అందజేశారు. ఉదయం నుండి భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

సాన సతీష్ బాబు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీల్లో భాగంగా స్థానిక మహారాణి కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన టీములు జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు. ఈ పోటీలకు మండల పరిధిలో 15 టీములు వచ్చాయన్నారు. విన్నర్ జట్టుకు జ్ఞాపికతో పాటు రూ.8 వేల నగదు, రన్నర్స్ జట్టుకు జ్ఞాపికతో పాటు రూ.5 వేలు నగదు బహుమతులు ఉంటాయన్నారు. పతి టీముకూ రూ.వెయ్యి నగదు అందజేస్తామన్నారు.

3న ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

నవంబర్ 3న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య కోరారు. శుక్రవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో మండల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)కు అనుగుణంగా సీస్ పరీక్ష రాష్ట్ర విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఎంఇఒలు మాట్లాడుతూ 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నవంబర్ 3న పబ్లిక్ పరీక్షల మాదిరి నిర్వహిస్తారని తెలిపారు. గణితం, లాంగ్వేజ్‌లో 60 మార్కులకు ఒఎంఆర్ విధానంలో పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించి, జాతీయ స్థాయిలో మన ర్యాంక్ తెలుసుకోవడంతో పాటు ఉన్నత ప్రమాణాల సాధనకు ప్రణాళిక రూపొందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కూర్మారావు, హెచ్ఎంలు ఎల్.గోవిందరాజు, యు.సత్యనారాయణ, ప్రసూన, కుసుమ, మీనా మాధురి, పాండవులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనపై ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

సిఎం వైఎస్.జగన్ అధికారంచేపట్టిన నాటి నుంచి నేటి వరకూ అందుతున్న సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ వాలంటీర్‌లు, గృహసారథులు ఇంటింటికుఈ వెళ్లి ప్రజలకు వివరించాలని ఎపి స్టేట్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక యార్లగడ్డ సూర్యారావు రైతు భవన్‌లో మండల పరిధిలో గ్రామ వాలంటీర్లు, గృహసారథులకు మళ్లీ ఎపికి జగనే సిఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రాధాన్యతను మళ్లీ ఎందుకు అధికారంలోకి రావాలో ప్రతి ఒక్కరికీ అర్థం అయ్యేలా వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపిపిలు ములసా శ్రీను, పేర్నిడి వెంకటరాయుడు, తాటికొండ అచ్చిరాజు, ఎలిశెట్టి నరేష్, మలకల వరాలబాబు, కొప్పిరెడ్డి రాధాకృష్ణ, తలారి దొరబాబు, గ్రామ వలంటీర్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 4వ వార్డులో మంచి నీటి పైపులైన్ నిర్మాణానికి శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో కలిసి 18వ వార్డులో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సిమ్మ సూర్యావతి, నీలంశెట్టి అమ్మాజీ, విడదాసరి రాజా, ఆరెళ్ల వీర రాఘవ, కో ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు సిమ్మ అంజి, నీలంశెట్టి పండు, మున్సిపల్ ఎఇ జీవన్ పాల్గొన్నారు.



ఎంఎల్ఎను నిలదీస్తున్న మత్స్యకార మహిళలు

ఇళ్ల స్థలాల కోసం ఎంఎల్ఎ నిలదీత

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబును మత్స్యకార మహిళలు చుట్టుముట్టి నిలదీశారు. మూలపేటలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక సర్పంచ్ మౌనిక లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎంఎల్ఎ దొరబాబును వాడ బలిజపేటలో మత్స్యకార మహిళలు ఇళ్ల స్థలాల కోసం నిలదీశారు. దీంతో స్థానిక సచివాలయ సిబ్బందిని పిలిచి ఇళ్ల స్థలాలు రానివారి పేర్లను తక్షణమే నమోదు చేయాలని ఎంఎల్ఎ ఆదేశించారు.

తాగునీటి కాలుష్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -కరప

వేళంగి గ్రామంలో రక్షిత తాగునీరు ప్రాజెక్టు నుంచి మురుగునీరు సరఫరా అవుతోందని గ్రామ కార్యదర్శులకు గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో మంచినీరుకి బదులు మురికి నీరు సరఫరా అవుతోందని ఈ మురికి నీరు తాగి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు టైఫాయిడ్ జ్వరంతో హాస్పటల్‌లో వైద్యం పొందుతున్నారని చెప్పారు. వేళంగి వైసిపి నాయకుడు పిల్లి వీరబాబు కుటుంబంలో ఆరుగురు టైఫాయిడ్ జ్వరంతో అనారోగ్యానికి గురైనట్టు తెలిపారు. విష జ్వరాల పట్ల అవగాహన కల్పించడంలో అధికారులు, వైద్య సిబ్బంది పట్టనట్టు వ్యవహరిస్తున్నారని చెప్పారు. దీనిపై సెక్రటరీ స్పందిస్తూ సమస్యపై సంబంధిత అధికారులకు తెలియపరుస్తామని తెలిపారు.



పంట చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పంట ప్రయోగాల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం ఎడిఆర్ డాక్టర్ ఎం.భరత లక్ష్మి ఆధ్వర్యంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం కట్టమూరు, గోరింట గ్రామాల్లోని పంట ప్రయోగాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ భరత్ లక్ష్మి ఆధ్వర్యంలో అధిక పంట దిగుబడులు, చీడ పీడల నివారణ, మంచి వంగడాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతిక విధానాలు వంటి అంశాలపై రైతులతో చర్చా గోష్టి నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.వెంకట నరసింహారావు, డాక్టర్ ఐ.సుధీర్ కుమార్, డాక్టర్ భరత లక్ష్మి తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

యానాం వార్తలు



చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

10 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - యానాం

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసే చెకుముకి సైన్స్ సంబరాలను నవంబర్ 10 నుంచి 2024 జనవరి 28 వరకు నాలుగు స్థాయిలో నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు ఆనాల వీరభద్రరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ఎఒ మునిస్వామిని కలిసి ఆయన చేతుల మీదుగా చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో చదువుకునే 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొనాలని కోరారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులను మునిస్వామి అభినందించారు. ఈ కార్యక్రమంలో కెవివి సత్యనారాయణ, టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు తాగునీటికి అంతరాయం

ప్రజాశక్తి - యానాం

యానాం టౌన్ వాటర్ వర్క్స్‌లో నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా శనివారం సాయంత్రం పూట తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరు కాళ్ళ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మెట్టకూరు, గోపాల్ నగర్, అంబేద్కర్ నగర్, ఫ్రాన్స్ తిప్ప, కురసాంపేట ప్రాంత వినియోగదారులకు జరుగుతున్న అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

హోంగార్డ్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ

ప్రజాశక్తి - యానాం

యానాం,పుదుచ్చేరి, మాహే, కారైకాల్ రీజియన్ పరిధిలోని పుదుచ్చేరి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న హోంగార్డు పోస్టులకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. యానాం-25, మహే-37, కరేకల్-68, పుదుచ్చేరి 290 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 30 నుంచి నవంబర్ 29వ తేదీల్లోగా అర్హులైన అభ్యర్థులు రిక్రూట్మెంట్. పివై. జి ఓ వి. ఇన్ వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా యానాంకు కేటాయించిన దానిలో ఒక మహిళ హోంగార్డుకు సైతం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజవర్గానికి సంబంధించి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఆర్ఎఒ మునిస్వామి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 9 లోగా డ్రాఫ్ట్ జాబితాపై అభ్యంతరాలను తెలుపవచ్చుని, దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. జనవరి 5న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, బిజెపి అధ్యక్షుడు కనకాల రాజు, డిఎంకె అధ్యక్షుడు భాషా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, బిఎస్‌పి అధ్యక్షుడు దూళిపూడి మధు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



కలశ యాత్రలో పాల్గొన్న డాక్టర్ కె.కలెక్టర్ మాధవీలత

పర్యావరణాన్ని పరిరక్షిణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ కలశ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత పిల్లలు చిన్నప్పటి నుంచి దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. మన దేశ సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించటానికి వివిధ ప్రాంతాల నుంచి మట్టిని, నీరును సేకరించే పవిత్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. దేశ ప్రధాని పిలుపు మేరకు జిల్లాలోని 18 మండలాలు, మూడు పట్టణ ప్రాంతాల నుంచి మట్టి, నీరు, బియ్యం సేకరించి ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అందజేయడం జరుగుతుందన్నారు. శనివారం విజయవాడ నుంచి ప్రత్యేక రైలు ద్వారా రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చే అధికారుల నేతృత్వంలోని బృందాలు విజయవాడ చేరుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 300 గ్రామ పంచాయతీల నుంచి ఆమేరకు సేకరణ చేపట్టి, ప్రతి మండలం నుంచి రెండేసి కలశాలు జిల్లా ప్రధాన కేంద్రానికి చేరుకున్నట్లు తెలిపారు. జిల్లా తరపున నోడల్ అధికారిగా డ్వామా ఎఇ జె.సూర్యనారాయణ ను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, .జెసి ఎన్.తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ప్రాజెక్ట్ డైరెక్టర్ (డ్వామా) పి. జగదాంబ తదితరులు కలశ యాత్ర నిర్వహించారు.

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి-అయినవిల్లి



లబ్ధిదారులకు చెక్కుఅందిస్తున్న ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు

నల్లచెరువు, వీరవిల్లిపాలెం, నేదునూరు, వెలువలపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సిఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల6వేల చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకట చార్యులు, వైస్ ఎంపిపి బాయ్యా చినబాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు బొంతు రాజేద్రప్రసాద్, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, శనపల్లిలంక సొసైటీ అధ్యక్షులు మాట్టపర్తి రామారావు, మండల అధ్యక్షులు కుడుపూడి విద్యాసాగర్, నాయకులు లబ్దిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వైసిపి నేత చంటి మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి సీనియర్ నాయకుడు కిత్తన చెరువుకు చెందిన బళ్ల చంటి(57) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. చంటి మృతి పట్ల మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్, ఎంపిపి దంగేటి అచ్యుత జానకి, జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, వైసిపి మండల అధ్యక్ష కార్యదర్శులు బద్రి బాబ్జి తదితరులు సంతాపం తెలిపారు.



బాధితులకు నిత్యావసరాలు, వంట సామగ్రి అందజేస్తున్న దృశ్యం

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కొమరగిరి గ్రామ పంచాయతీలో లైన్‌పేట గ్రామంలో అర్ధరాత్రి సమయంలో మాగాపు అప్పాయమ్మ కు సంబంధించి తాటాకిల్లు షార్ట్ సర్క్యూట్ కారణగా దగ్ధమైంది. ఆ సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవటంతో ఆ ఇంటిలో ఉన్న సిమెంటు బస్తాలు, రూ. 5లక్షలు నగదు కాలి బూడిద అయ్యాయి. ఈ ఘటనపై సమాచారాన్ని సమీపంలో బంధు వులు శుక్రవారం పంచాయతీ అధికారులకు తెలిపారు. విషయం తెలుసుకొన్న రెడ్ క్రాస్ సొసైటీ వారు వంట సామగ్రి, 30కేజీలు బియ్యం, ఐజినిక్ కిట్, టార్పాలిన్, కూరగాయలు బాధితులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ, వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్ రాజు, ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి, సర్పంచ్ వరసాల విజయచాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-మండపేట

గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణ ప్రభుత్వాస్పత్రిలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు స్పందన, భావన, లావణ్య, సుధా తదితరులు పాల్గొన్నారు.

గంగుమళ్లకు మాజీ ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-అయినవిల్లి

ఇటీవల హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న అయినవిల్లి మాజీ జెడ్‌పిటిసి సభ్యురాలు గంగుమళ్ల కాశీ అన్నపూర్ణను కె.జగన్నాథపురం గ్రామంలోని వారి స్వగృహంలో పి.గన్నవరం మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరిదేవి శుక్రవారం పరామర్శించారు. అన్నపూర్ణ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ- 2024 కు సంబంధించి శుక్రవారం ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు రాజకీయ పార్టీల ప్రతినిధులకు శుక్రవారం అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7,40,749 మంది పురుష లు, 7,48,023 మంది స్త్రీలు, 22 మంది ట్రాన్స్ జెండర్స్ వెరసి 14,88,794 మంది ఓటర్లుగా ఇ ప్పటి వరకు నమోదయ్యారని అన్నారు.

మరమ్మతు పనుల్లో నాణ్యత ఉండాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి విజ్జేశ్వరం వరకు జిల్లాకు చెందిన రహదారి పనుల కోసం కేటాయించిన రూ.25 లక్షల నిధులను నాణ్యతతో పనులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేయాలని కలెక్టర్ కె. మాధవీలత ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ప్రతిపాదించిన రహదారుల పనులను ఇరిగేషన్, రవాణా, పోలీస్ తదితర శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ బ్యారేజ్ రహదారి ప్రాంతంలో రూ.25 లక్షల నిధులతో చేపడుతున్న పనుల పురోగతిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. నాణ్యత విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలక్ష్యం వహించ వద్దని స్పష్టం చేశారు. ఆర్ సి ఆర్ బి (రోడ్ కం రైల్ బ్రిడ్జి) పనులను పూర్తి నాణ్యత కలిగిన ప్రామాణికం గా చేపట్టడం జరుగుతోందని అన్నారు. రహదారి పనుల్లో ప్యాచ్ వర్క్ ఇతర పనులు పూర్తి స్థాయి ప్రమాణాలకు తగినట్లుగా చేపట్టాలని అన్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ చేపట్టడం జరిగిందని, నవంబర్ 9 న ఓపెన్ చేయనున్నట్లు కలెక్టర్ కి వివరించారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ అధికారులు ఇఇ ఆర్.కాశీ విశ్వేశ్వర రావు, డిఇ యు.రమేష తదితరులు పాల్గొన్నారు.

జైల్లో 'జెఎఎస్' శిబిరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జెఎఎస్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారని జైలు సూపరింటెండెంట్ ఎస్ . రాహుల్ తెలిపారు. స్థానిక సెంట్రల్ జైల్‌లో శు క్రవారం జెఎఎస్ శిబిరంలో తొలిరోజు 572 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఖైదీలకు స్పెషలిస్ట్ డాక్టర్లు ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి, తదనుగుణంగా తదుపరి వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లా ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డా పి. ప్రియాంక మాట్లాడుతూ మొత్తం 9 విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ తొలి రోజు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఆ క్రమంలో కంటి సంబంధ సమస్యలతో పాటు, హుద్రోహ, జనరల్ మెడికల్, అర్థోపెడిక్, తదితర సేవలు అందించినట్లు తెలిపారు. ఉచితంగా కంటి అద్దాలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక మహిళా కారాగారంలో ఈనెల 30న మహిళా కారాగారంలో జెఎఎస్ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్ల తో పాటు గైనిక్ డాక్టర్లు కూడా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.